# వీడిన మబ్బులు

"రండి, రండి మీ కొరకే ఎదురు చూస్తున్నాం, రఘు, వాసు అప్పుడే వచ్చేశారు" అన్నాడు. రాఘవరావు చైతన్య కుటుంబాన్ని ఉద్దేశిస్తూ

తను అనుకున్న నిరాశ కానీ, విచారం కానీ కనిపించలేదు చైతన్యకు తన తండ్రి ముఖంలో. ఇల్లు అమ్మకానికి పెట్టమని తాము గోపాలరావు గారి ద్వారా కబురు పెట్టినా నిబ్బరంగా ఉన్న తండ్రిని చూసి ఆశ్చర్యం కల్గింది.

సామాను లోపలి గదిలో పెట్టి, కాళ్ళు, చేతులు కడుక్కుని హాల్లోకి వచ్చాడు చైతన్య. స్వప్న అత్తగారి దగ్గరకు వంటింట్లోకి పోయింది. పిల్లలు ఆడుకోవడానికి వెళ్ళారు.

చైతన్య హాల్లోకి వచ్చే సరికి తండ్రి, తమ్ముళ్ళు వాసు, రఘు గంభీరంగా ఉన్నారు. తాము ఇల్లు అమ్మనవసరం లేదని చెప్పి వారిని ఆశ్చర్య పరచాలనుకున్నాడు. ఇంతలో రాఘవయ్య మొదలు పెట్టాడు.

"ఇదిగో మునసబు గారికి మన ఇల్లు అమ్మిన దస్తావేజు. నీవు, వాసు, రఘు సాక్షి సంతకాలు చేస్తే ఆయనకు రిజిస్ట్రీకి పంపించొచ్చు. మీరు అనుకున్న దానికంటే ఐదు వేలు ఎక్కువే వచ్చాయి. బయానా కూడా తీసుకున్నాను. గోపాలరావు బాకీ తీరిపోవడమే కాక కొంత మొత్తం మిగులుతుంది కూడా"

ఇప్పుడు ఆశ్చర్యపోవడం చైతన్య వంతయింది. తాము వచ్చిన తర్వాతే అగ్రిమెంటు వ్రాయిస్తామని చెప్పారే గోపాలరావు గారు! ఇప్పటికే అగ్రిమెంటు ఎలా వ్రాశారు ? నాన్నగారు ఇంత సులభంగా ఎలా ఒప్పుకున్నారు ?

చైతన్య మనసులో జవాబు లేని ప్రశ్నలు కూడదీసుకుని,

"అసలు ఇల్లు అమ్మే అవసరం లేదు నాన్నా" అన్నాడు

"మరి బాకీ సంగతి?"

"బాకీకి తగ్గ డబ్బులు తీసుకునే వచ్చాను. మొన్న గోపాలరావు గారు వచ్చినపుడు ఇల్లు అమ్మకానికి పెట్టమని చెప్పిన మాట నిజం. తమ్ముళ్లు కూడా అదే ఉద్దేశం వ్యక్త పరిచారు. కాని మీ కోడలు నా కళ్ళు తెరిపించింది. ఇన్నాళ్ళూ ఈ ఇంటి మీద మీ ప్రేమను

అర్ధంలేని 'సెంటిమెంటు'గా కొట్టివేసిన నాకు మీరు చిన్నప్పుడు ఇచ్చిన పెన్ను ద్వారా జ్ఞానోదయం కలుగజేసింది"

ఒక్క క్షణం తండ్రి ముఖంలోకి చూశాడు. మళ్ళీ చెప్పసాగాడు.

"ఒకరోజు ఇప్పటి నా ఈ ఉన్నత స్థితికి ప్రతీకగా పదిల పరచుకున్న పెన్ను పోయిందనే సరికి పిచ్చెక్కింది. ఆ అయిదు రూపాయల పెన్ను కొరకు ఇంట్లో, ఆఫీసులో అందరి మీద విరుచుకు పడ్డాను. రాత్రి పెన్ను దొరికిందని స్వప్న చెప్పినపుడు నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. ఒక పెన్నిధి దొరికినట్టయింది. అప్పుడు నా ఆలోచనను మీ మీదికి ఈ ఇంటి మీదికి మరల్చింది మీ కోడలు. ఈ ఇంటిపై మీ మక్కువ ప్రేమే కాని పిచ్చి సెంటిమెంటు కాదంది"

"మీ కడుపున పుట్టి ఇంత వారమైనా మేము తెలుసుకోలేని మీ మనసును పరాయి ఇంటి ఆడపడుచు తెలుసుకుంది. ఈ వయసులో మీ మనసు నొప్పించడం మంచిది కాదంది. మీరు చెప్పించిన చదువులు మాకు లాజిక్ నేర్పాయి. ఇలాంటి విషయాల్లో ఆలోచించాల్సింది మెదడుతో కాదని, హృదయంతోననీ సున్నితంగానైనా గట్టిగా చెప్పింది. అందుకే మా ఇల్లు కట్టుడు రెండు సంవత్సరాలు వాయిదా వేసి ఈ ఇంటి మీద బాకీ తీర్చాలని వచ్చాను."

వాసు, రఘులకు ఆశ్యర్యం కల్గింది.

తమ చేతికి చమురు తగలకుండా సమస్య తీరుతున్నందుకు ఆనందంగా కూడా వుంది.

"ఇప్పుడు సమయం మించి పోయింది చైతన్యా. అగ్రిమెంటు వ్రాసి బయానా కూడా పుచ్చుకున్న తర్వాత ఇక వెనుకకు తిరగడం లేదు. గత రెండేళ్ళుగా మీరు ఇల్లు అమ్మమనడం, నేను వద్దనడం, మధ్యలో గోపాలరావు గారు తన కొడుకుల దగ్గర చులకనవడం, ఇక ఇంకా సాగదీయడం మంచిది కాదనుకున్నాను. మీ పరంగా కూడా ఆలోచించాలనుకున్నాను."

" ఈ ఇంటితో వున్న నా అనుబంధం, ప్రేమ నాకు మాత్రం పరిమితం. ఉద్యోగరీత్యా మీరు ముగ్గురు మూడు చోట్ల స్థిరపడ్డారు. మీ పిల్లలు, వారి చదువు మీ బాధ్యతలు మీకున్నాయి. మిమ్మల్ని కష్టపెట్టి ఈ ఇంటిని పట్టుకు వేళ్ళాడడం మంచిది కాదనుకున్నాను. నా స్వార్థానికి మిమ్మల్ని బాధ పెట్టకూడదనుకున్నాను. నేను కట్టిన ఇంటిలో నా తండ్రి వుండగా లేనిది, నా కొడుకు కట్టిన ఇంటిలో నేనుండకూడదా? మీ అమ్మకు కూడా తన కొడుకులకు దగ్గరగా వుండాలని వుంది. ఇంటి మీద వ్యామోహంతో నా భార్యను, కొడుకులను, కోడళ్ళను అసంతోషపర్చడం విజ్ఞత కాదనిపించింది. ఇంకా ఆలోచిస్తే, మూర్ఖంగా కూడా తోచింది. వెంటనే మునసబు గారి వద్దకు గోపాలరావుతో వెళ్ళి దస్తావేజు వ్రాయించాను."

"ఆ అగ్రిమెంటు రద్దు చేయమని మునసబు గారిని బ్రతిమిలాడతాము నాన్నా" వాసు అన్నాడు. చైతన్య, రఘు వంత పాడారు.

"ఈ విషయంలో నా మాటకిక తిరుగులేదు. ఇది ఏదో ఆవేశంలో తీసుకున్న నిర్ణయం కాదు. తర్జన భర్జన చేసి అన్ని విధాల ఆలోచించి, మనందరి శ్రేయస్సు దృష్ట్యా ఈ ఇల్లు అమ్మకానికి పెట్టాను"

"మీ మనసు నొప్పించినందుకు మమ్మల్ని క్షమించు నాన్నా. మాకు చదువులు చెప్పించి ఇంతవారిని చేసిన మీ రుణం కొంతయినా తీర్చుకోనివ్వండి" చైతన్య అన్నాడు.

"మీకు చదువులు చెప్పించి మిమ్మల్ని ఇంతటి వారిగా చేసింది మీపై పెట్టుబడిగా కాదు, రుణంగా కూడా కాదు, మిమ్మల్ని కన్నందుకు తండ్రిగా నా బాధ్యతగా చేశాను"

"మమ్మల్ని కూడా మా బాధ్యత నిర్వహించనీయండి నాన్న. ఇన్నాళ్ళూ మీ ప్రేమను అర్థం చేసుకోక, వట్టి సెంటిమెంటుగా కొట్టి పారేసాం. ఇప్పుడు కనువిప్పు కల్గింది. మీ చలువవల్ల బాగనే బతుకుతున్నాం. ఇల్లు కట్టడం రెండేళ్ళు వాయిదా వేస్తే సరి. ఇప్పుడు ఈ బాకీ తీరిపోతుంది. తాతయ్య కోరికకు ప్రతిరూపమయిన ఈ ఇల్లు ఇలాగే వుండిపోతుంది"

"చైతన్యా! ప్రేమలు, సెంటిమెంట్లు ఒక హద్దు వరకే బాగుంటాయని ఈ మధ్యనే తెలుసుకున్నాను. మితిమీరిన ప్రేమ, వ్యామోహం అవుతుంది. మూర్ఖత్వానికి దారి తీస్తుంది. నలుగురిని కష్టపెడుతుంది. నిజమైన ప్రేమ ఆత్మీయతను పెంచుతుంది.వ్యామోహం స్వార్థానికి ప్రతీక, తాను మాత్రం సంతోషంగా వుండటం కంటే నలుగురు, అదీ తన వాళ్ళు ఆనందంగా వుండడం ముఖ్యం. నిజమైన ప్రేమ త్యాగానికి మూలం. అదే అమృతత్వాన్ని పొందజేస్తుంది. 'త్యాగేనైవే అమృతత్వమానశః' అన్నారు పెద్దలు. అందుకని నా నిర్ణయాలు ఆమోదించండి. సాక్షి సంతకాలు చేయండి."

"మీ పట్టుదల తెలిసిన మాకు, ఇక మీ నిర్ణయానికి తిరుగులేదని తెలుసు. అయినా మరొక్కసారి ఆలోచించండి. వేం ముగురన్నదమ్ములం, మునసబుగారిని ప్రాధేయపడతాం. అగ్రిమెంటు రద్దు చేయమని కోరతాం. వారి బయానా తిరిగి ఇచ్చేస్తాం" వాసు ధైర్యం కూడగట్టుకుని అన్నాడు.

"గోపాలరావు బాకీ సకాలానికి తీర్చలేకే మాట తప్పిన వాణ్ణయ్యాను. స్నేహాన్ని దురుపయోగం చేసుకున్నట్టయింది. ఇక మునసబుగారి దగ్గర కూడా మాట తప్పమని బలవంత పెట్టకండి. ఈ ఇల్లు అమ్మి నేనూ, మీ అమ్మ చైతన్య ఇంట్లో వుంటాం. వెన్నలాంటి మనసున్న మా కోడలు, కాదు కూతురు... స్వప్న దగ్గర కృష్ణా రామా అంటూ రోజులు వెళ్ళదీస్తాం. భగవంతుని దయవుంటే మీరు కట్టే కొత్త ఇంట్లోనే కాలధర్మం చెందుతాం.'

చైతన్య, వాసు, రఘుల మనసులు ఆర్ద్రమయ్యాయి. రాఘవయ్యగారి కళ్ళు నీళ్ళతో నిండినాయి. కానీ వాటిలో ఓ మెరుపు వుంది, ఓ సంతృప్తి వుంది. కించిత్తు గర్వం కూడా తొంగి చూస్తోంది.

★